https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 20 గురువారం 14-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# రాష్ట్రవ్యాప్తంగా మెగా గ్రోత్ కారిడార్లు

## ఖమ్మం, వరంగల్, కరీంనగర్‌లకు ఔటర్ రింగురోడ్లు

**నల్లగొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్**

**ఆదిలాబాద్, బాసర, కడెం మధ్య టూరిజం కారిడార్**

**మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్ల కేంద్రంగా ఒకటి, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచకు మరొకటి..**

**వచ్చే 25 ఏళ్లకు సరిపోయేలా వీటిని డిజైన్ చేయాలి**

**ఇంధన ఖర్చు తగ్గింపులో భాగంగా ఈవీలనే వాడాలి**

**మున్సిపాలిటీల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు: సీఎం రేవంత్**

**హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ**

**600 మందితో అమెరికా వెలుపల తొలి కేంద్రం**

**ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటు**

**సీఎం రేవంత్‌తో భేటీలో ఉబర్ సీఈవో ఖోస్రోషాహి**



**హైదరాబాద్, మే 13**

రాష్ట్ర వ్యాప్తంగా మెగా గ్రోత్ కారిడార్లు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వచ్చే 25 ఏళ్లకు సరిపడేలా వీటిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో మెగా గ్రోత్ కారిడార్లపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ ఖమ్మం, వరంగల్, కరీంనగర్ నగరాల చుట్టూ ఔటర్ రింగు రోడ్ల (ఓఆర్ఆర్)ను ఏర్పాటు చేయాలని, అవసరమైన మేర మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) నిర్మించాలని ఆదేశించారు. ఈ కారిడార్ భవిష్యత్‌లో తెలంగాణకు చాలా కీలకమని సీఎం పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతాల్లో రోడ్లను నిర్మించాలని సూచించారు. అలాగే, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచను కలుపుతూ ఒక కారిడార్, మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలుపుతూ మరొక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీటితోపాటు నల్లగొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్, ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టును కలుపుతూ టూరిజం కారిడార్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కానుందని, వరంగల్‌లోని మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మించనున్నామని.. వీటిని దృష్టిలో ఉంచుకుని రోడ్ల నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణంలో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. నగరాలే కేంద్రంగా అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని సూచించారు.

పట్టణాలు, నగరాల్లో రేడియేషన్ ప్రభావాన్ని తగ్గించడానికి మల్టీ యుటిలిటీ టవర్స్ ఏర్పాటు చేయాలని, ఇందుకోసం ప్రతీచోట స్మార్ట్ పోల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సీవరేజ్ అండ్ వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు నుంచి శుద్ధి చేసిన నీటినే భవన నిర్మాణాల్లో ఉపయోగించేలా నిబంధన పెట్టాలని ఆదేశించారు. పెద్ద మునిసిపాలిటీల సమీపంలో రేడియల్ రోడ్లు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వీటిని ఆయా నగరాలు, పట్టణాల జనాభాకు తగినట్టు డిజైన్ చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగంపై సాంకేతిక నిపుణుల సలహా తీసుకోవాలన్నారు. ఇంధన ఖర్చు తగ్గింపు చర్యల్లో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాలని, లీజుకు తీసుకునేవి కూడా ఈవీలే ఉండాలని సీఎం ఆదేశించారు. మునిసిపాలిటీల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జోగులాంబ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని మునిసిపాలిటీలను ఒక యూనిట్‌గా తీసుకుని, సీఎ?సఆర్ నిధులను ఖర్చు చేయాలన్నారు. తెలంగాణ లోకాయుక్త జస్టిస్ రాజశేఖరరెడ్డి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఈఈపీసీ) రీజినల్ చైర్మన్ రామన్ రఘు, రీజినల్ డైరక్టర్ జె.వి. రాజగోపాలరావు, సైనిక్ సంక్షేమ శాఖ డైరక్టర్ బ్రిగేడియర్ ఎన్.ఆర్ బాబు కూడా సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# వరికి మరో రూ.72

**క్వింటాల్‌కు సాధారణ రకానికి రూ.2,441, ఏ గ్రేడ్‌కు 2,461**

**పంటలకు మద్దతు ధర పెంచుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం**

**అత్యధికంగా పొద్దుతిరుగుడుకు రూ.622 పెంపు**



**న్యూఢిల్లీ, మే 13**

అన్నదాతలకు ఊరటనిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి 14 రకాల పంటలకు కనీస మద్దతు ధరలను (ఎమ్మెస్పీ) పెంచేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని మంత్రి వర్గం ఆమోదముద్ర వేసింది. రైతులకు పెట్టుబడిపై కనీసం 50% లాభం చేకూర్చాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించింది. వరికి మద్దతు ధరను రూ.72 పెంచారు. దీనితో సాధారణ రకం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,441కి చేరింది. అత్యధికంగా పొద్దుతిరుగుడు గింజలకు క్వింటాల్ రూ.622 మేర ధర పెంచారు. ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ ఉప సంఘం (సీసీఈఏ)లో తీసుకున్న నిర్ణయాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 2014-2026 మధ్య వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పారు. రైతుల నుంచి వరి ధాన్యం సేకరణ, చెల్లింపులు భారీగా పెరిగాయన్నారు. 2004-14 మధ్య వరి రైతులకు రూ. 4.44 లక్షల కోట్లు చెల్లించగా.. 2014-26 మధ్య ఈ మొత్తం రూ.16.08 లక్షల కోట్లకు చేరిందని వివరించారు. తాజా ధరల పెరుగుదలతో.. పెసర సాగు చేస్తున్న రైతులకు అత్యధికంగా 61 శాతం లాభం వచ్చే అవకాశం ఉందన్నారు. తర్వాత మొక్కజొన్న, సజ్జ రైతులకు 56శాతం, కంది రైతులకు 54 శాతం మేర లాభం చేకూరుతుందన్నారు. నూనెగింజలు, పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో ఆ పంటలకు మద్దతు ధర పెంచామన్నారు. ఇక రూ.20,667 కోట్లతో గుజరాత్‌లో సర్ఖేజ్-ధొలేరా సెమీ హైస్పీడ్ రైల్వేట్రాక్ నిర్మాణానికి, నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆధునీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు.

# జూలైలో సీపీ గేట్‌పరీక్షలు

**కేయూ క్యాంపస్ మే 13**



తెలంగాణ స్టేట్ కామన్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రెన్స్ టెస్ట్-26 (టీజీ సీపీ గేట్) షెడ్యూల్ విడుదలైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్నత విద్యామండలి అధికారులు, వీసీలు, కన్వీనర్‌తో జరిగిన సమావేశంలో సీపీ గేట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 15 నుంచి జూన్ 10 వరకు అపరాధ రుసుము లేకుండా దరఖాస్తులు స్వీకరించనున్నారు. జూన్ 16 నుంచి 19 వరకు దరఖాస్తుల తప్పులను సవరించుకునే అవకాశం కల్పించారు. జూలై మొదటి వారంలో పరీక్షలు నిర్వహిస్తామని కన్వీనర్ కె.రాజేందర్ తెలిపారు.

# విచారణకు రాని భగీరథ్

**హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మే 13**



పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్.. బుధవారం పోలీసు విచారణకు గైర్హాజరయ్యాడు. పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు భగీరథ్‌ను తీసుకురావాలంటూ మంగళవారం అతని మేనమామకు పోలీసులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే తనకు రెండు రోజులు సమయం కావాలంటూ భగీరథ్.. పేట్ బషీరాబాద్ పోలీసులకు ఈ-మెయిల్ చేశాడు. తనపై వచ్చిన ఆరోపణలు తప్పు అని నిరూపించుకునే ఆధారాలతో 15న విచారణకు హాజరవుతానని పేర్కొన్నాడు. అయితే ఈ-మెయిల్‌ను తాము పరిగణనలోకి తీసుకోబోమని కేసు పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తున్న డీసీపీ రితిరాజ్ తెలిపారు. భగీరథ్‌ను పట్టుకోవడానికి ఐదు పోలీస్ బృందాలను రంగంలోకి దింపామన్నారు. రెండు బృందాలు ఢిల్లీలో, రెండు హైదరాబాద్‌లో, ఒక బృందం కరీంనగర్‌లో గాలిస్తున్నాయని ఏసీపీ శంకర్‌రెడ్డి వెల్లడించారు. కాగా, భగీరథ్ విచారణకు రాకపోవడాన్ని పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. అదే సమయంలో రెండు రోజుల సమయం కోరుతూ తమకు చేసిన ఈ-మెయిల్‌ను సోషల్‌మీడియాలో భగీరథ్ ప్రచారం చేసుకోవడాన్ని పోలీసులు తప్పుడుతున్నారు. మరోవైపు బాధిత బాలిక వయసు విషయంలో తమకు అనుమానాలు ఉన్నాయని భగీరథ్ న్యాయవాది పంపిన నోటీసుకు జవాబిచ్చేందుకు పోలీసులు సన్నద్ధమయ్యారు.

**బాలికకు రెండు బర్త్ సర్టిఫికెట్లు**

బాధిత బాలిక వయసుకు సంబంధించి కుటుంబసభ్యులు రెండు బర్త్ సర్టిఫికెట్లను చూపిస్తున్నారని, ఆధార్ కార్డులు రెండు వేర్వేరు పేర్లతో ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. ఇలా రెండు ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందనే విషయాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం బాలిక జన్మించిన హైదరాబాద్‌లోని ఆస్పత్రికి లేఖ రాశారు. దీంతోపాటు తనపై లైంగికదాడి యత్నం జరిగిందని బాధితురాలు పేర్కొన్న మూడు ప్రదేశాల్లో రెండు చోట్ల గురువారం సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేపడుతామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. మైనర్ బాలికకు సంబంధించిన పోక్సో కేసులో మీడియా ట్రయల్స్ నిర్వహించడం దర్యాప్తును సంక్లిష్టం చేస్తుందన్నారు. నిష్పక్షపాతంగా ఆధారాలు సేకరిస్తున్నామని, హైకోర్టులో కౌంటర్ దాఖలు చేస్తున్నామని తెలిపారు. బాధిత బాలిక వాంగ్మూలం ఆధారంగా ఇప్పటికే కొన్ని సెక్షన్లను అదనంగా జోడించామని, దర్యాప్తులో మరికొన్ని సెక్షన్లు జోడించే అవకాశాలను తోసిపుచ్చలేమని అంటున్నారు. కాగా, ఈ కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ భగీరథ్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది.

# అద్భుతంగా అమరావతి

**20 ఏళ్లలో ప్రపంచంలోనే మేటి నగరం అవుతుంది: చంద్రబాబు**

**రాజధాని ప్రాంతంలో కిమ్స్ 'బైసర్'కు శంకుస్థాపన**

**గుంటూరు, మే 13**

'వచ్చే ఇరవై ఏళ్లలో రాజధాని అమరావతి ప్రపంచంలోనే మేటి నగరంగా నిలుస్తుంది. పెట్టుబడులు, పారిశ్రామికవేత్తల రాకతో అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ అవతరిస్తుంది. భవిష్యత్తులో హైదరాబాద్‌ను మించిన మెరుగైన హైదరాబాద్ ప్లస్ సిటీగా సిద్ధమవుతుంది' అని సీఎం చంద్రబాబు చెప్పారు. రాజధాని అమరావతి పరిధిలోని నిడమర్రులో బుధవారం బొల్లినేని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (బైసర్), మెడికల్ కాలేజీ, కార్పొరేట్ ఆస్పత్రి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సభలో ప్రసంగించారు. ప్రపంచంలో ఐదు చోట్ల మాత్రమే ఉన్న క్వాంటమ్ కంప్యూటర్ ఇప్పుడు అమరావతికి వస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రాష్ట్రంలో విధ్వంసం జరిగిందన్నారు. అలాంటి అరాచక పాలన తన జీవితంలో చూడలేదని చెప్పారు. తాను యువత భవిష్యత్ మాత్రమే చూస్తానని, వారికి ఉద్యోగాలు ఇవ్వాలనేది తన ఆలోచన అని పేర్కొన్నారు. సభలో ఆయన ఇంకా ఏమన్నారంటే.. 'రాజధాని అభివృద్ధి పారిశ్రామిక వేత్తల రాకతోనే సాధ్యం. వారిని ప్రోత్సహించేందుకు పరిశ్రమలకు, సంస్థల ఏర్పాటుకు అనుమతులన్నీ ఆటోపైలట్ మోడ్‌లో ఇచ్చే బాధ్యత మాది. నిర్మాణాలు పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత పారిశ్రామికవేత్తలది. టెక్నాలజీ, ఏఐ ఆధారిత వైద్యరంగానిదే భవిష్యత్తు. రాబోయే రోజుల్లో దానికి మంచి అవకాశం ఉంది. ఆ అవకాశం బైసర్ ద్వారా రాష్ట్ర యువతకు వచ్చింది. వచ్చే ఏడాది ఇదే రోజునాటికి బైసర్ ప్రారంభం కావాలి. 2027లో ఇదే రోజున అమరావతిలో కిమ్స్ ఆస్పత్రి ప్రారంభం కావాలి. 2028 ఆగస్టు 15నాటికి గూగుల్ డేటా



సెంటర్, 2028 డిసెంబరు లోపల ఆర్సెల్లార్ మిట్టల్ ఫేజ్ 1 పూర్తి చేయాలని ఆ సంస్థలకు కూడా చెప్పాం. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ 23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆ ప్రాజెక్టులు పూర్తయితే 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఇప్పుడు అమరావతిలో ఏర్పాటవుతున్న బైసర్ ద్వారా మరో లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. అది బోనస్ అవుతుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వైద్యులతో పాటు నర్సులు, పారామెడికల్ సిబ్బంది, టెక్నీషియన్ల అవసరం చాలా ఉంది. డాక్టర్లు కూడా ఏఐ నేర్చుకోవాలి. మ్యాన్‌పవర్ లేక జపాన్, జర్మనీ లాంటి దేశాలు మనవైపు చూస్తున్నాయి. ఏ దేశంలో డిమాండ్ ఉంటే ఆ దేశాలకు వెళ్లి పనిచేసేలా మన యువత విదేశీ భాషలు నేర్చుకోవాలి.

# చైనాలో ట్రంప్..

**3 రోజుల పర్యటనను ప్రారంభించిన అమెరికా అధ్యక్షుడు**

**ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం.. నేడు, రేపు జిన్‌పింగ్‌తో చర్చలు**

**బీజింగ్, మే 13:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం చైనా పర్యటనను ప్రారంభించారు. బీజింగ్ విమానాశ్రయంలో దిగిన ఆయనకు చైనా ఉపాధ్యక్షుడు హన్ జెంగ్ స్వయంగా స్వాగతం పలికారు. తద్వారా ట్రంప్ పర్యటనకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో చైనా తెలియజేసినట్లయిందని విశ్లేషకులు భావిస్తున్నారు. సాధారణంగా చైనాకు పుతిన్ సహా విదేశీ నేతలు ఎవరు వచ్చినా ఎయిర్‌పోర్టులో ఆయా రాష్ట్రాల ఉన్నతస్థాయి ప్రతినిధులే స్వాగతం పలుకుతుంటారు. ట్రంప్ విషయంలో చైనా ఈ సంప్రదాయాన్ని పక్కన పెట్టటం విశేషం. విమానాశ్రయంలో ట్రంప్‌నకు చైనా సైనిక దళం గౌరవ వందనం సమర్పించింది.. ట్రంప్ వెంట ఆయన కుమారుడు ఎరిక్, కోడలు లారా, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, ఆపిల్ సీఈఓ టిమ్ కుక్ తదితర వ్యాపారవేత్తలున్నారు. గురు, శుక్రవారాల్లో ట్రంప్, చైనా అధినేత జిన్‌పింగ్ పలు అంశాలపై చర్చలు జరపనున్నారు. దీనిపై ట్రంప్ సోషల్ మీడియాలో ఓ పోస్టు కూడా పెట్టారు. 'చైనా ద్వారాలు తెరవాలని, తద్వారా ఈ తెలివైన వ్యక్తులు (అమెరికా వ్యాపారవేత్తలు) మీతో కలిసి పని చేసి చైనాను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తారని అసాధారణ నాయకుడైన ప్రెసిడెంట్ జిన్‌పింగ్‌కు విజ్ఞప్తి చేస్తా' అని పేర్కొన్నారు. కాగా.. వాణిజ్యం, సుంకాలు, ఏఐ, టెక్నాలజీ, తైవాన్, ఇరాన్, పశ్చిమాసియా సంక్షోభం తదితర అంశాలపై ఇరు దేశాలు చర్చలు జరపనున్నాయి. కాగా, ట్రంప్ 2017లో తన తొలి దఫా పాలనలో చైనాలో పర్యటించారు. మళ్లీ ఆ దేశానికి రావటం 9 ఏళ్లలో ఇదే తొలిసారి.



# ప్రేమ ముసుగులో మోసం..

**యువతిని నమ్మించిన నయవంచకుడు రిమాండ్**

**పారదర్శక దర్యాప్తుతో అక్కన్నపేట యువ ఎస్సై ప్రశాంత్‌కు ప్రజల ప్రశంసలు**

**సిద్దిపేట క్రైమ్(అక్కన్నపేట)మే 13**
ప్రేమ పేరుతో యువతిని నమ్మించి, పెళ్లి చేసుకుంటానంటూ శారీరకంగా లొంగదీసుకుని అనంతరం మోసం చేసిన యువకుడిని అక్కన్నపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్ బుధవారం నాడొక ప్రకటనలో తెలిపారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలానికి చెందిన ఉస్తేం ప్రవీణ్ (22) అనే యువకుడు, అక్కన్నపేట మండల పరిధిలోని బొడిగెపల్లికి చెందిన ఓ యువతితో ప్రేమ పేరుతో పరిచయం పెంచుకున్నాడు. అనంతరం ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా లొంగదీసుకున్నాడు. అయితే పెళ్లి విషయానికి వచ్చేసరికి నిందితుడు ముఖం చాటేయడంతో మోసపోయిన యువతి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన అక్కన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఇక అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఇటీవల బాధ్యతలు చేపట్టిన యువ ఎస్సై ప్రశాంత్ విధుల్లో చూపుతున్న చురుకుదనం, కేసుల నమోదు-దర్యాప్తులో పాటిస్తున్న పారదర్శకత స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. చిన్న వయసులోనే ఎస్సై ఉద్యోగం సాధించిన ఆయన, పై అధికారుల సూచనలు తూచా తప్పకుండా అమలు చేస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నారని మండల ప్రజలు, రాజకీయ వర్గాలు, ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి ఫిర్యాదును సున్నితంగా స్వీకరించి చట్టపరమైన చర్యల్లో వేగం పెంచుతున్న తీరు పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.



నిందితుని అరెస్టు చూపుతున్న అక్కన్నపేట ఎస్సై చాతరాజు ప్రశాంత్

# బక్రీద్ వేళ గోవుల అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

**రాష్ట్రవ్యాప్తంగా అలర్ట్**

**సరిహద్దుల్లో 24 గంటల చెక్ పోస్టులు**


**వీసీలో సీపీలను ఆదేశించిన రాష్ట్ర డీజీపీ**

**సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు**

**శాంతి భద్రతల పరిరక్షణకోసం జిల్లాలోని పోలీస్ అధికారులను అప్రమత్తం చేసిన సీపీ సాధన రష్మీ పెరుమాళ్**



వీడియో కాన్ఫరెన్స్ తిలకిస్తున్న సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్


శాంతి భద్రతల దృష్ట్యా బక్రీద్ అంశంపై వివరిస్తున్న రాష్ట్ర డిజిపి దృశ్యం

**సిద్దిపేట క్రైమ్, మే 13**
బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలను కట్టుదిట్టం చేస్తూ పోలీసులు అప్రమత్తమయ్యారు. గోవుల అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రచారాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని రాష్ట్ర డీజీపీ సి.వి ఆనంద్ జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ప్రధాన రహదారులు, జిల్లాల సరిహద్దులు, అనుమానాస్పద మార్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ముఖ్యంగా గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అనంతరం జటిల కేసుల సాల్వర్ సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ జిల్లా పరిధిలోని అన్ని ప్రవేశ మార్గాల్లో 24 గంటల చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని జిల్లాలోని ఏసీపీ,సీఐ,ఎస్సై తదితర అధికారులను ఆదేశించారు. పోలీసులతో పాటు వెటర్నరీ సిబ్బందిని కూడా నియమించి అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మసీదులు, ప్రార్థనా స్థలాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చారు. మరోవైపు సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, చట్టవ్యతిరేక సందేశాలపై సైబర్ నిఘా పెంచినట్లు ఆమె వెల్లడించారు. అలాంటి పోస్టులు చేసే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బక్రీద్ పండుగను పరస్పర గౌరవం, మత సామరస్యం, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా, అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, సిద్దిపేట డివిజన్ ఏసీపీ రవీందర్ రెడ్డి, హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐలు, వెటర్నరీ,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# రైతు చెమటతో కాంగ్రెస్ ప్రయోగాలు

**హుస్నాబాద్ యార్డులో బీఆర్ఎస్ ఆగ్రహం**


మొక్కలను పరిశీలిస్తున్న బి.ఆర్.ఎస్ నాయకుల దృశ్యం

**హుస్నాబాద్, మే 13**
హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న రైతుల పరిస్థితి చూస్తే "రైతు రాజ్యం" అనే కాంగ్రెస్ నినాదం కేవలం మైక్‌లకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంట పండించేందుకు అప్పులు చేసి, రేయింబవళ్లు కష్టపడి మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతుకు చివరికి దక్కేది గిట్టుబాటు ధర కాదు... గడువు లేని ఎదురు చూపులేనని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున రెడ్డి, రైతుల ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "రైతు కోసం పని చేస్తున్నాం" అని చెప్పే ప్రభుత్వం, కనీసం గన్నీ సంచులు కూడా అందించలేని స్థితికి చేరిందంటే పాలన ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించేదని, ఇప్పుడు రైతే సంచి కొనుక్కొని రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. "ఇది రైతు సంక్షేమమా... లేక రైతును సంక్షోభంలోకి నెట్టే పాలనా?" అంటూ కాంగ్రెస్‌పై వ్యంగ్య బాణాలు సంధించారు. హుస్నాబాద్ మార్కెట్ యార్డులో కొనుగోలు చేసిన మొక్కజొన్నలకు సంబంధించిన కోట్లాది రూపాయల బకాయిలు ఇంకా రైతుల ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. పంట అమ్మిన రైతు డబ్బుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొనడం దారుణమన్నారు. "రైతు పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందో... లేక రైతు ఓపికను పరీక్షిస్తుందో అర్థం కావడం లేదు" అని విమర్శించారు. కొనుగోలు ప్రక్రియలో స్పష్టత లేకపోవడం, చెల్లింపుల్లో జాప్యం, సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా ప్రచారాలకే పరిమితమైందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులను ఇంకా నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పార్టీ రైతుల తరఫున పెద్ద ఎత్తున పోరాటానికి దిగుతుందని అయిలేని మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు.

# వ్యతిరేకించింది 22 మందే!

**బలపరీక్షలో సీఎం విజయ్ ఘనవిజయం**

**విశ్వాస తీర్మానానికి 144 మంది మద్దతు**

**నిలువునా చీలిన అన్నాడీఎంకే**

**25 మంది ఎమ్మెల్యేల వేరుకుంపటి**

**ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు**

**అసెంబ్లీ నుంచి డీఎంకే, డీఎండీకే వాకౌట్**

**ఓటింగ్‌కు ఎండీఎంకే సభ్యులు దూరం**

**పీఎంకే, బీజేపీ ఎమ్మెల్యేలు తటస్థం**

**చెన్నై, మే 13:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తొలి పరీక్ష నెగ్గారు. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఆదేశాలతో బుధవారం శాసనసభలో బలాన్ని నిరూపించుకున్నారు. 22 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారు. విశ్వాస తీర్మానంపై విజయ్ సర్కారుకు 144 మంది మద్దతిచ్చారు. పీఎంకే, బీజేపీ ఎమ్మెల్యేలు తటస్థంగా ఉండగా.. 59 మంది సభ్యులున్న ప్రధాన ప్రతిపక్షం డీఎంకే, ఒక ఎమ్మెల్యే ఉన్న డీఎండీకే ఓటింగ్‌లో పాల్గొనకుండా వాకౌట్ చేశాయి. మరో ప్రధాన పార్టీ అయిన అన్నాడీఎంకే రెండు వర్గాలుగా చీలిపోగా.. మాజీ మంత్రి వేలుమణి సారథ్యంలోని 25 మంది ఎమ్మెల్యేలు విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాలకు గాను.. విజయ్ సారథ్యంలోని టీవీకే 108 సీట్లు.. డీఎంకే 59, అన్నాడీఎంకే 47, కాంగ్రెస్ 5, పీఎంకే-4 సీపీఐ, సీపీఎం, వీసీకే, ఐయూఎంఎల్ రెండేసి చొప్పున, డీఎండీకే, ఏఎంఎంకే చెరోచోట గెలుపొందిన విషయం తెలిసిందే. రెండు చోట్ల విజయం సాధించిన విజయ్.. తిరుచ్చి తూర్పు నియోజకవర్గానికి రాజీనామా చేశారు (పెరంబూర్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు). ఒకే ఒక్క ఓటుతో గెలిచిన తిరుపత్తూర్ టీవీకే ఎమ్మెల్యే శ్రీనివాస సేతుపతి మద్రాస్ హైకోర్టు ఆదేశాలతో ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. దీంతో టీవీకే ఎమ్మెల్యేల సంఖ్య 106కు తగ్గింది. అయితే బలపరీక్షలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఐయూఎంఎల్, ఏఎంఎంకే సభ్యులు, అన్నాడీఎంకేకు చెందిన 25 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి అండగా నిలిచారు. ఎండీఎంకేకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు.

**మా పార్టీని చీలుస్తారా: ఎడప్పాడి**
శాసనసభలో అన్నాడీఎంకే రెండుగా చీలిపోయింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి నేతృత్వంలోని 22 మంది విజయ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేయగా.. వేలుమణి నేతృత్వంలోని 25 మంది మద్దతుగా నిలిచారు. విశ్వాస తీర్మానంపై చర్చలో పళనిస్వామి మాట్లాడుతూ.. నిజాయితీగా ప్రభుత్వాన్ని నడుపుతామని చెప్పిన సీఎం విజయ్.. తమ పార్టీని చీల్చి, వారితో భేటీ కావడమేంటని ప్రశ్నించారు. తర్వాత వేలుమణి మాట్లాడుతూ.. ప్రజాభీష్టం మేరకు తామంతా విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. తమ మిత్రపక్షాలతో పాటు వివిధ పార్టీల ఎమ్మెల్యేలను అరువుగా తెచ్చుకుని ప్రభుత్వాన్ని నిలబెట్టుకున్న విజయ్.. ఎలా సుపరిపాలన అందిస్తారని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించారు. మెజారిటీ లేని ఈ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందన్న నమ్మకం తనకు లేదని సభలో ప్రసంగిస్తూ వ్యాఖ్యానించారు. 'పార్టీ ఫిరాయింపులకు ముందు సీఎం అన్నాడీఎంకేలో ఆ వర్గానికి చెందిన నాయకుడి ఇంటికి వెళ్లి కలుసుకోవడమనేది దేశ చరిత్రలో ఎన్నడూ లేదు. ఈ పరిణామాలన్నీ చూసి మీకు ఓటు వేసిన ప్రజలు.. పెద్ద తప్పు చేశామని ఆలోచించడం మొదలుపెట్టారు' అని ఉదయనిధి అన్నారు.

**ప్రజల రుణం తీర్చుకుంటాం: విజయ్**
తమ ప్రభుత్వం రాజకీయ కక్షతో ఎవరి మనసులూ నొప్పించదని, గాయపరచదని.. నమ్మిన ప్రజల రుణం తీర్చుకునేలా తమ పనితీరు ఉంటుందని సీఎం విజయ్ స్పష్టంచేశారు. విశ్వాస పరీక్ష సందర్భంగా ఆయన అసెంబ్లీలో ప్రసంగించారు. 'మాది మైనారిటీ ప్రభుత్వమే. ఈ విషయాన్ని మేమే చెబుతున్నాం. ఇది రాష్ట్రంలోని మైనారిటీలకు రక్షణ కల్పించే ప్రభుత్వం' అని తెలిపారు. ఇదిలా ఉండగా, తమిళనాడు అసెంబ్లీలో బుధవారం బలపరీక్షలో తిరుపత్తూర్ టీవీకే ఎమ్మెల్యే శ్రీనివాస సేతుపతి పాల్గొనకుండా మద్రాస్ హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. హైకోర్టు విచారణను కూడా నిలిపివేసింది. ఎన్నికల పిటిషన్ ద్వారానే ఈ సమస్యను తేల్చాలని హైకోర్టే చెప్పిందని.. మళ్లీ తానే రాజ్యాంగంలోని 226 అధికరణ కింద పిటిషన్‌ను స్వీకరించడం దారుణమని పేర్కొంది. ఈ వ్యవహారంలో రెండు వారాల్లోగా పూర్తి వివరాలు అందించాలని పిటిషనర్‌తో పాటు ఎన్నికల కమిషన్‌ను కూడా ఆదేశించింది.

## హిందూ మతం ఓ జీవన విధానం: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, మే 13:**
హిందూ మత విశ్వాసానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. హిందూ మతం ఓ జీవన విధానమని, హిందువులెవరైనా మతం పట్ల తమ విశ్వాసాన్ని చాటుకునేందుకు గుడికి వెళ్లి పూజలు చేయాల్సిన అవసరమేమీ లేదని పేర్కొంది. తమ ఇంట్లో దీపం వెలిగించినా సరిపోతుందని వ్యాఖ్యానించింది. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం, మత స్వేచ్ఛకు సంబంధించి పలు ఇతర పిటిషన్లపై విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాల్సిన అవసరమేమీ లేదని, ఒకరి విశ్వాసాన్ని మరొకరు ప్రశ్నించాల్సిన అవసరమూ లేదని వ్యాఖ్యానించారు. కాగా, మత విశ్వాసాలపై ప్రతి ఒక్కరూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడం మొదలుపెడితే వందల కొద్దీ పిటిషన్లు వస్తాయని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

# ఇంధన పొదుపుకు సైకిల్ బాట

**ప్రధాని పిలుపుతో కారుకు గుడ్‌బై చెప్పిన అధికారి**

**పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యానికి మేలు**

**ప్రజలంతా భాగస్వాములైతే ఉద్యమంగా మారుతుందన్న ఆశాభావం**



**ఢిల్లీ, మే 13:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు క్షేత్రస్థాయిలో ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో జీఎస్టీ శాఖ డిప్యూటీ కమిషనర్ నరేంద్ర యాదవ్ తన విలాసవంతమైన కారును పక్కనపెట్టి సైకిల్‌పై కార్యాలయానికి వెళ్లడం ప్రారంభించడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం దేశం అంతర్జాతీయ స్థాయిలో పలు సవాళ్లను ఎదుర్కొంటోందని, ఇలాంటి సమయంలో ప్రతి పౌరుడు దేశ హితం కోసం తన వంతు బాధ్యత నిర్వర్తించాలని నరేంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు కొంతమేర ఊరటనివ్వవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. సైకిల్ కేవలం పర్యావరణ హితమైన ప్రయాణ సాధనం మాత్రమే కాదని, ఆరోగ్యాన్ని కాపాడే ఉత్తమ మార్గమని ఆయన తెలిపారు. ప్రతిరోజూ సైకిల్ తొక్కడం వల్ల శారీరక దృఢత్వం పెరుగుతుందని, మధుమేహం, రక్తపోటు వంటి సాంక్రమికేతర వ్యాధులను నియంత్రణలో ఉంచుకోవచ్చని వివరించారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ ట్రాఫిక్ పరిస్థితుల్లో కారులో ప్రయాణించినా, సైకిల్‌పై వెళ్లినా సమయం దాదాపు ఒకే విధంగా ఉంటుందని నరేంద్ర యాదవ్ అభిప్రాయపడ్డారు. తాను సైకిల్ వినియోగించడం చూసి తన కార్యాలయంలోని ఇతర ఉద్యోగులు కూడా స్ఫూర్తి పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. దగ్గర దూరాలకు వెళ్లేటప్పుడు ప్రజలు సైకిల్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రజలు క్రమంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములైతే అది పెద్ద ప్రజా ఉద్యమంగా మారే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. "ఒక్కరు చేస్తే ప్రయోజనం ఉండదని అనుకోకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నప్పటికీ అంతర్జాతీయ ఇంధన సంక్షోభాన్ని విస్మరించలేమని, పొదుపు చర్యలు కొనసాగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# ఇరాన్‌పై కొత్త వ్యూహం

**- అమెరికా సైన్యం దాడుల ప్రణాళికలపై చర్చ - కాంగ్రెస్ అనుమతిపై మార్గాల అన్వేషణ - 'స్లెడ్జ్ హ్యామర్' పేరుపై పరిశీలన**



**వాషింగ్టన్, మే 13**

ఇరాన్‌పై మరోసారి సైనిక చర్యలకు దిగాల్సి వస్తే అమెరికా కాంగ్రెస్ అనుమతి ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా కొత్త వ్యూహాలపై అమెరికా సైన్యం కసరత్తు చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. కొత్త సైనిక చర్యకు "ఆపరేషన్ స్లెడ్జ్ హ్యామర్" అనే పేరు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. గత ఫిబ్రవరి 28న ఇరాన్‌పై చేపట్టిన సైనిక చర్యకు అమెరికా ప్రభుత్వం "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" అని పేరు పెట్టింది. ఆ తర్వాత జరిగిన తీవ్ర ఉద్రిక్తతల అనంతరం ఇరాన్–అమెరికా మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీంతో ఆ సైనిక చర్య ముగిసినట్లేనని అమెరికా ప్రభుత్వం కాంగ్రెస్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో జరుగుతున్న చర్చలు విఫలమైతే మళ్లీ దాడులకు దిగుతామని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కొత్త యుద్ధ చర్య మరింత తీవ్రంగా ఉంటుందనే సంకేతం ఇచ్చేలా "ఆపరేషన్ స్లెడ్జ్ హ్యామర్" అనే పేరును పరిశీలిస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. మరికొన్ని పేర్లను కూడా అమెరికా సైన్యం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అమెరికా చట్టాల ప్రకారం యుద్ధాన్ని అధికారికంగా ప్రకటించే హక్కు అక్కడి కాంగ్రెస్‌కే ఉంటుంది. సాధారణంగా విదేశీ భూభాగంలో సైనిక చర్యలు ప్రారంభించిన 48 గంటల్లోపు అధ్యక్షుడు కాంగ్రెస్‌కు సమాచారం ఇవ్వాలి. అనంతరం 60 రోజుల్లోగా కాంగ్రెస్ అనుమతి పొందాల్సి ఉంటుంది. అయితే ఆ గడువు వరకు సైనిక చర్యలను కొనసాగించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పాత ఆపరేషన్‌కు సంబంధించిన 60 రోజుల గడువు ముగియడంతో కొత్త వ్యూహాలపై చర్చ జరుగుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# విజయ్‌తో కశ్మీర్‌కు క్రేజ్..

**తమిళ పర్యాటకులతో కిటకిటలాడుతున్న సిఫార్ కేఫే**

**'లియో' సినిమా తర్వాత పెరిగిన ఆకర్షణ**

**కశ్మీర్-తమిళనాడు మధ్య కొత్త అనుబంధం**






**అనంతనాగ్, మే 13**

దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా ఒకప్పుడు ఉగ్రవాద కార్యకలాపాలతో వార్తల్లో నిలిచేది. భద్రతా బలగాల తనిఖీలు, ఉద్రిక్త పరిస్థితులు, పర్యాటకుల భయాందోళనలతో ఈ ప్రాంతం చాలా కాలం పాటు సాధారణ జీవనానికి దూరంగా నిలిచింది. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అనంతనాగ్‌లోని 'సిఫార్ కేఫే' ప్రస్తుతం తమిళ పర్యాటకులతో సందడిగా మారింది. యువత ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తూ, కుటుంబాలు ఆసక్తిగా కేఫేను సందర్శిస్తూ ఈ ప్రాంతానికి కొత్త గుర్తింపును తీసుకొస్తున్నాయి. ఈ మార్పుకు ప్రధాన కారణంగా తమిళ సూపర్ స్టార్, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నిలిచారు. విజయ్ నటించిన 'లియో' సినిమా చిత్రీకరణలో భాగంగా ఈ కేఫేలో కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించారు. షూటింగ్ సమయంలో విజయ్ ఇక్కడికి వచ్చి స్థానిక ప్రత్యేక వంటకం అయిన 'ట్రౌట్ ఫిష్'ను రుచి చూశారు. సాధారణంగా కనిపించే ఈ చిన్న సంఘటన అభిమానుల దృష్టిలో ప్రత్యేకంగా మారింది. సినిమా విడుదలైన తర్వాత 'సిఫార్ కేఫే' గురించి సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీంతో తమిళనాడు నుంచి అభిమానులు వందల కిలోమీటర్లు ప్రయాణించి ఈ ప్రదేశాన్ని సందర్శించడం ప్రారంభించారు. ప్రస్తుతం కేఫే గోడలన్నీ విజయ్ పోస్టర్లతో నిండిపోయాయి. అభిమానులు అక్కడికి వెళ్లి ఫొటోలు దిగడం, వీడియోలు చిత్రీకరించడం, విజయ్ కూర్చున్న ప్రదేశంలో కూర్చోవడం వంటి విషయాలను ప్రత్యేక అనుభూతిగా భావిస్తున్నారు. కేఫే సిబ్బంది కూడా విజయ్ షూటింగ్ సమయంలో జరిగిన సంఘటనలను సందర్శకులకు ఆసక్తిగా వివరిస్తున్నారు. ఆయన ఏ వంటకం ఆర్డర్ చేశారో, ఎక్కడ కూర్చున్నారో చెబుతూ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నారు. 'లియో' సినిమా విడుదల సమయంలోనే ఈ కేఫేకు గుర్తింపు వచ్చినప్పటికీ, విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ ఆసక్తి మరింత పెరిగింది. అభిమానులు తమ అభిమాన నటుడు, ఇప్పుడు ముఖ్యమంత్రి అయిన వ్యక్తి సందర్శించిన ప్రదేశాన్ని చూడటం గర్వంగా భావిస్తున్నారు. దీంతో సాధారణ కేఫేగా ఉన్న ఈ స్థలం ఇప్పుడు ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారిపోయింది. స్థానిక వ్యాపారులకు కూడా ఇది ఆర్థికంగా పెద్ద ఊరటనిస్తోంది. ఒకప్పుడు ఉగ్రవాదం కారణంగా ప్రజలు వెళ్లేందుకు భయపడిన అనంతనాగ్ ప్రాంతానికి ఇప్పుడు సినిమా ప్రభావంతో పర్యాటకులు భారీగా రావడం విశేషంగా మారింది. కశ్మీర్ ప్రకృతి అందాలు, స్థానిక ఆహారం, సినిమా షూటింగ్ ప్రాంతాలపై ఆసక్తి పెరగడంతో పర్యాటక రంగానికి కొత్త ఊపు వచ్చింది. ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాల ద్వారా ఈ ప్రాంతాన్ని మరింత ప్రచారం చేస్తుండటం స్థానికులకు లాభదాయకంగా మారింది. సినిమా ప్రభావం సమాజంపై ఎంత లోతుగా ఉంటుందో ఈ ఘటన మరోసారి నిరూపించింది. విజయ్ కేవలం సినిమా షూటింగ్ కోసం అక్కడికి వెళ్లినా, అది తమిళనాడు--కశ్మీర్ మధ్య ఒక కొత్త అనుబంధానికి దారి తీసింది. సిఫార్ కేఫే ఇప్పుడు కేవలం భోజనం చేసే ప్రదేశం మాత్రమే కాదు, రెండు విభిన్న సంస్కృతులను కలిపే వారధిగా మారింది. పర్యాటక రంగం, స్థానిక ఆర్థిక వ్యవస్థ, సాంస్కృతిక మార్పిడి–ఖశ్రీశ్రీ కలిసి ఈ కేఫేను ప్రత్యేక గుర్తింపుతో నిలబెట్టాయి.

## ఇంధన భారం.. విమానాలకు కోత

**అంతర్జాతీయ సర్వీసులు తగ్గిస్తున్న ఎయిరిండియా**

**ఏటీఎఫ్ ధరల పెరుగుదలతో నిర్ణయం**

**యూరప్, అమెరికా మార్గాలపై ప్రభావం**

**న్యూఢిల్లీ, మే 13**




పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో విమాన సంస్థల నిర్వహణ వ్యయాలు భారీగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. రోజువారీగా వంద విమాన సర్వీసులను తగ్గించేందుకు సంస్థ సిద్ధమవుతోంది. జూన్ నెల నుంచి మూడు నెలలపాటు పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను తగ్గించనున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ఢిల్లీ నుంచి షికాగో, నెవార్క్, సింగపూర్, షాంఘై వంటి కీలక అంతర్జాతీయ గమ్యస్థానాలకు నడిచే కొన్ని సర్వీసులను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. అలాగే శాన్‌ఫ్రాన్సిస్కో, పారిస్, టొరంటో మార్గాల్లో కూడా విమానాల సంఖ్యను తగ్గించనున్నట్లు తెలిపింది. ప్రయాణికుల డిమాండ్ ఉన్నప్పటికీ పెరిగిన నిర్వహణ వ్యయాల కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని సంస్థ పేర్కొంది. ఎయిరిండియా ప్రధాన కార్యనిర్వాహణ అధికారి క్యాంప్‌బెల్ విల్సన్ మాట్లాడుతూ ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు భారీగా పెరుగుతున్నందున షెడ్యూళ్లలో కోత విధించడం తప్ప మరో మార్గం లేదన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితులు విమానయాన రంగానికి తీవ్రమైన సవాళ్లు విసురుతున్నాయని తెలిపారు. ఇంధన ఖర్చులు పెరగడంతో ప్రతి విమాన ప్రయాణ వ్యయం గణనీయంగా అధికమైందన్నారు. పాకిస్థాన్ గగనతలం మూసివేసి ఉండటం కూడా ఎయిరిండియాపై అదనపు భారం మోపుతోందని సంస్థ వెల్లడించింది. యూరప్, ఉత్తర అమెరికా దేశాలకు వెళ్లే విమానాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి రావడంతో ప్రయాణ దూరం పెరిగిందని పేర్కొంది. దీని కారణంగా ఇంధన వినియోగం మాత్రమే కాకుండా సిబ్బంది పని గంటలు, నిర్వహణ వ్యయాలు కూడా పెరిగిపోయాయని వివరించింది. దీర్ఘ మార్గాల్లో ప్రయాణించడం వల్ల విమానాలపై సాంకేతిక ఒత్తిడి కూడా అధికమవుతోందని తెలిపింది. ప్రస్తుతం పెరుగుతున్న ఖర్చులను టికెట్ ధరల ద్వారా పూర్తిగా భర్తీ చేయడం సాధ్యం కావడం లేదని సంస్థ వర్గాలు పేర్కొంటున్నాయి. విమానాల నిర్వహణ, సిబ్బంది వేతనాలు, ఇంధన వినియోగం, ఎయిర్‌పోర్టు చార్జీలు వంటి అంశాలు కలిపి సంస్థపై భారీ ఆర్థిక ఒత్తిడి పెంచుతున్నాయని వెల్లడించాయి. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ సర్వీసులపై కూడా కోత విధించే అవకాశం ఉందని ఎయిరిండియా హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం కారణంగా విమానయాన రంగం మరోసారి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఇప్పటికే అనేక అంతర్జాతీయ విమాన సంస్థలు తమ కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరించే పనిలో ఉన్నాయి. ఎయిరిండియా తాజా నిర్ణయం భారత విమానయాన రంగంపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రయాణికులకు టికెట్ ధరల పెరుగుదల, సర్వీసుల తగ్గింపు వంటి ఇబ్బందులు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## విద్యార్థిని వద్ద భారీ గంజాయి పట్టివేత

**మంగళూరులో బీసీఏ విద్యార్థిని అరెస్ట్**

**రూ.35 లక్షల హైబ్రిడ్ గంజాయి స్వాధీనం**

**కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు**



**మంగళూరు, మే 13**

కర్ణాటకలో మాదకద్రవ్యాల ముఠాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో మంగళూరు నగరంలో భారీగా హైబ్రిడ్ గంజాయి రవాణా చేస్తున్న ఓ విద్యార్థినిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితురాలి వద్ద నుంచి సుమారు రూ.35 లక్షల విలువైన హైబ్రిడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు బుధవారం వెల్లడించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శివమొగ్గ జిల్లా సాగర్‌కు చెందిన సుహానా ఉడిపి జిల్లా కుందాపురలోని ఓ ప్రముఖ కళాశాలలో బీసీఏ చివరి సంవత్సరం చదువుతోంది. చెన్నై నుంచి హైబ్రిడ్ గంజాయిని తీసుకువచ్చి మంగళూరులోని కాలేజీ విద్యార్థులు, ధనిక వర్గాలకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ సమాచారంతో పనంబూరు, ముల్కి పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. మంగళవారం ముల్కి రైల్వే స్టేషన్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న సమయంలో పోలీసులు సుహానాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి సుమారు 1.40 కిలోల హైబ్రిడ్ గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సాధారణ గంజాయితో పోలిస్తే హైబ్రిడ్ గంజాయికి మార్కెట్లో అధిక డిమాండ్ ఉండటంతో దీని విలువ భారీగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో సుహానాపై గతంలోనూ పలు క్రిమినల్ కేసులు నమోదైనట్లు తేలింది. బెంగళూరు, మంగళూరు నగరాల్లో కూడా ఆమెపై మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం కింద కవూరు పోలీస్ స్టేషన్‌లో, అలాగే బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు కూడా గతంలో కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. మాదకద్రవ్యాల వ్యాపారం ఇప్పుడు కాలేజీ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని విస్తరిస్తోందని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హైబ్రిడ్ గంజాయి వంటి మత్తు పదార్థాలు యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. నగరాల్లో ధనిక యువత, విద్యార్థుల్లో డిమాండ్ పెరగడంతో డ్రగ్స్ ముఠాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత ఘటనపై ముల్కి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# నేను అలా మాట్లాడకుండా ఉండాల్సింది ..

## నటి మృణాల్ ఠాకూర్

బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ గతంలో ఒక ఇంటర్వ్యూలో నటి బిపాసా బసుపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ విషయంపై మృణాల్ తాజాగా స్పందిస్తూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా క్షమాపణలు తెలిపారు. వైరల్ అవుతున్న వీడియోలో, మృణాల్ తాను బిపాసా కంటే అందంగా ఉంటానని, ఆమె “కండలు తిరిగిన పురుషుడిలా” కనిపిస్తారని పేర్కొనడం చర్చనీయాంశమైంది. దీనిపై పలువురు నెటిజన్లు, బాలీవుడ్ ప్రముఖులు ఆమె వ్యాఖ్యలను బాడీ షేమింగ్‌గా అభివర్ణిస్తూ తీవ్రంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో స్పందించిన మృణాల్, “అది నేను 19 ఏళ్ల వయసులో సరదాగా మాట్లాడిన వీడియో. ఆ సమయంలో నా మాటల వల్ల ఎవరికైనా నష్టం జరుగుతుందన్న భావన నాకుండేది కాదు. నేను ఎవరినీ అవమానించాలనే ఉద్దేశంతో మాట్లాడలేదు. ఇప్పుడు ఆ వ్యాఖ్యలపై తీవ్రంగా విచారిస్తున్నాను. శరీర సౌందర్యం అంటే ఏమిటో ఇప్పుడు నాకు బాగా అర్థమవుతోంది,” అంటూ భావోద్వేగపూరితంగా పేర్కొన్నారు. ఇక బిపాసా బసు కూడా ఈ వివాదంపై పరోక్షంగా స్పందిస్తూ, “మహిళలంతా శారీరకంగా బలంగా ఉండాలి. మగాళ్లా కనిపించకూడదనే పాత ఆలోచనల నుంచి బయటపడాల్సిన అవసరం ఉంది” అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు

# అనుదీప్‌తో సినిమా చేస్తున్నా..

## కామెడీ చేయడం చాలా కష్టమైన పని : కయాదు లోహర్



శ్రీవిష్ణు నటించిన అల్లూరి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది అస్సామీ సుందరి కయాదు లోహర్ ఈ ఏడాది ప్రదీప్ రంగనాథన్ నటించిన డ్రాగన్ మూవీతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ ముద్దుగుమ్మ జాతిరత్నాలు డైరెక్టర్ అనుదీప్‌తో సినిమా చేస్తుందట. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకుంది. అంతేకాదు కామెడీ చేయడం ఎంత కష్టమో చెప్పింది కయాదు లోహర్. నేను అనుదీప్ డైరెక్షన్‌లో వస్తోన్న ఓ సినిమాలో నటిస్తున్నా. ఈ మూవీ పూర్తిగా కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. సినిమాలోని చాలా డైలాగ్స్ షూటింగ్ స్పాట్‌లో ఆలోచించి రాసినవే. ప్రతీ ఐదు నిమిషాలకోసారి వచ్చే సీన్ కొత్తగా చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందంటూ చెప్పుకొచ్చింది కయాదు లోహర్. కామెడీ చేయడం చాలా కష్టమైన పని. ఎందుకంటే నేను అనుదీప్ సార్‌తో ఓ సినిమా చేస్తున్నా. కామెడీ చాలా కష్టమని తెలుసుకున్నా. ఎందుకో నాకు తెలియదు కానీ దానికి భాష కూడా ముఖ్యమే. మీకు భాష తెలిసినప్పుడు దాని అర్థమేంటో.. ఆ సంస్కృతి ఏంటో మీకు తెలుస్తుంది. తద్వారా కామెడీ కూడా సహజంగానే వస్తుంది. సంస్కృతితోపాటు ప్రేక్షకుల నాడి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. నాకు నవ్వించే స్వభావం ఉందని నమ్ముతా. కానీ కామెడీ చేయాల్సి వస్తే మాత్రం అది చాలా కష్టమైన పని. అది షూటింగ్ చేసేటప్పుడు చాలా చాలా కష్టంగా ఉంటుంది. ప్రతీ పంచ్ సరిగ్గా వేయాలి.. ప్రతీ టేక్‌ను సరైన విధంగా వచ్చేలా చూసుకోవాలి. కామెడీ అనేది స్క్రిప్ట్‌పై ఆధారపడే కాకుండా స్పాట్‌లో ఆయన (అనుదీప్)చాలా డైలాగ్స్‌తో రాస్తుంటారు. నాకు ఒక డైలాగ్ ఉందంటే మళ్లీ ఐదు నిమిషాల తర్వాత మరో డైలాగ్ వస్తుంటుంది. ఈ సంభాషణలు, కామెడీ ప్రతీ సారి కొత్తగా మారుతూనే ఉంటాయి. ఒక నా భాష (అస్సామీ)లో కామెడీ చేస్తే అంత కష్టం కాదు. కానీ వేరే భాషలో చేయాలంటే చాలా కష్టం అంటూ చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ అనుదీప్ కయాదు లోహర్‌ను ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. కయాదు లోహర్ 2021లో ముగిల్‌పేట అనే కన్నడ మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మలయాళంలో పాథోన్‌పథం నూట్టుండు సినిమాలో నటించిన ఈ బ్యూటీ అనంతరం శ్రీ విష్ణు సరసన ‘అల్లూరి’ చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది.

### పెద్ద యుద్ధాలు జరుగుతాయంటూ

# ఉదయభాను కామెంట్స్



తెలుగమ్మాయి అయిన ఉదయభాను సంచలన వ్యాఖ్యలతో హాట్ టాపిక్ అయింది. ఎప్పటికప్పుడు తన అభిప్రాయాలను స్పష్టంగా చెప్పే ఈ యాంకర్ ఇటీవల త్రిబాణధారి బార్బరిక్ సినిమాపై ప్రమోషన్స్ లో పాల్గొని ఇండస్ట్రీలో యాంకర్‌లకు ఎదురవుతున్న అసమానతలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇటీవల “ఓ భామ అయ్యో రామ” ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడుతూ, ఇండస్ట్రీలో కొన్ని గ్రూపులు యాంకరింగ్‌ను సిండికేట్‌లా మార్చేశారని ఉదయభాను వ్యాఖ్యానించారు. అయితే ఆ వ్యాఖ్యలపై నానా రకాల విమర్శలు వచ్చాయి. కొందరు ఆమెకి అవకాశాలు లేక అలా అన్నారని, మరికొందరు వార్తలలో నిలవడం కోసం అలా మాట్లాడారని అభిప్రాయపడ్డారు. తాజాగా దానిపై క్లారిటీ ఇస్తూ.. “ఆ రోజు నేను జోక్‌గా అన్నా కూడా అది అబద్ధం కాదు. ఈ రంగంలో నాకు ఎదురైన అనుభవాలే నన్ను అలా మాట్లాడేలా చేశాయి. ఎన్నో సార్లు ఈవెంట్‌కు రెడీ అయ్యి వెళ్లాక, ఆ ఛాన్స్ వేరొకరికి వెళ్లిందని తెలిసి వెనక్కి వచ్చాను. కొన్ని ఛానల్స్ నన్ను అడిగి డేట్స్ తీసుకున్నారు, తర్వాత ఎలాంటి సమాచారం లేకుండానే ప్రాజెక్ట్ నుంచి తీసేశారు. తనపై “హైయెస్ట్ పెయిడ్ యాంకర్” అనే ట్యాగ్ వేసినప్పటికీ వాస్తవ పరిస్థితి వేరని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికొచ్చి చూస్తే, ఎన్ని చెక్కులు బౌన్స్ అయ్యాయో తెలుస్తుంది. ఇది షో ఆఫ్ కాదు, నిజం. తను ఎప్పుడూ సెలెక్టివ్ గా ఉన్నానని, చిన్న ఇంటర్వ్యూలు చేస్తే తనతో పాటు ఉన్న చిన్న యాంకర్ల భవిష్యత్తును దెబ్బతీయడం అవుతుందని, అందుకే అవి ఒప్పుకునే దానిని కాదని ఉదయ భాను పేర్కొంది. ఇండస్ట్రీలో తనపై జరిగిన అన్యాయాలన్నీ త్వరలో బహిరంగంగా చెబుతాను అని ఉదయభాను వెల్లడించారు. ఆ రోజు వచ్చినప్పుడు పెద్ద పెద్ద యుద్ధాలే జరుగుతాయి. కానీ నేను మాట్లాడేది ఎవరిని తక్కువ చేయడం కోసం కాదు. వచ్చే తరం కొద్దిపాటి అవగాహన కోసం. తన అభిప్రాయాల్లో ఉండే తాత్వికత (ఫిలాసఫీ) తన చదువుల్లో మాత్రమే కాకుండా, కెరీర్ నేర్పిన జీవిత పాఠాల వలన ఏర్పడిందని చెప్పారు. అందుకే ప్రస్తుతం ఒక పుస్తకాన్ని రాస్తున్నట్లు తెలిపారు.

# ఏంటీ బ్యూటీ డల్‌గా ఉన్నావు..

ఆలోచనలో పడిపోయిన భాగ్యశ్రీ బొర్సే!

అందాల ముద్దుగుమ్మ భాగ్య శ్రీ బొర్సే గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చి చాలా తక్కువ సమయమే అయినప్పటికీ యూత్‌లో మాత్రం మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ మధ్య ఎవరినోట విన్నా ఈ అమ్మడు పేరే వినిపిస్తుంది. అంతలా తన అందంతో అందరినీ మాయ చేసింది ఈ బ్యూటీ. భాగ్య శ్రీ బొర్సే మాస్ మహారాజ్ రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ మూవీలో నటించి మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ మూవీలో ఈ అమ్మడు నటన, గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీంతో ఆ మూవీ రిలీజైనప్పటి నుంచి ఈ బ్యూటీ యూత్ లేటెస్ట్ క్రష్ అయిపోయింది. ఇక మూవీ విడుదలై అభిమానులను నిరాశ పరిచినప్పటికీ ఈ అమ్మడుకు మాత్రం విపరీతమైన క్రేజ్ వచ్చింది. దీంతో ఈ బ్యూటీ వరసగా ఆఫర్స్ అందుకుంటూ దూసుకెళ్తున్నట్లు టాక్ వినిపిస్తుంది. ఇక ఈ మధ్య విజయ్ దేవరకొండ సరసన, కింగ్ డమ్ మూవీలో కనిపించి మెప్పించింది. కానీ ఈ మూవీలో ఈ బ్యూటీరోల్ అంతగా లేకపోవడంతో ఈఅమ్మడుకు ఇది అంతగా కలిసిరాలేదనే చెప్పాలి. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ తన ఫొటోస్ షేర్ చేస్తూ కుర్రకారును మాయ చేస్తుంటుంది. ఈ క్రమంలోనే ఈ అమ్మడు తాజాగా, చాలా డల్‌గా, ఏదో ఆలోచిస్తున్నట్లు కూర్చున్న ఫొటోస్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. అందులో ఈ అమ్మడును చూసిన వారందరూ షాక్ అవుతున్నారు. దీంతో ఏంటీ బ్యూటీ చాలా డల్ అయ్యావు.. ఏం ఆలోచిస్తున్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. మరీ మీరు కూడా ఈ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి.

